

## లగేజీ అనుమతిలో కోత

- ఎయిర్ ఇండియా నిర్ణయం

న్యూఢిల్లీ, మే 2: డొమెస్టిక్ ప్రయాణికుల లగేజీ అనుమతిలో కోత విధిస్తూ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా నిర్ణయం తీసుకుంది. గతంలో ఎకనామీ కంఫర్ట్ ప్రయాణికులకు 20 కేజీల లగేజీతో ప్రయాణించేందుకు అనుమతి ఉండగా ఇప్పుడు 15 కిలోలకు తగ్గించింది. ఎకనామీ కంఫర్ట్ ప్లస్ క్లాస్ ప్రయాణికులకు ఇంతకుముందు 25 కిలోలకు అనుమతి ఉండగా ఇప్పుడు 15 కిలోలకు తగ్గించింది. బిజినెస్ కంఫర్ట్ ప్లస్ ప్రయాణికులకు గతంలో 35 కిలోల వరకు లగేజీతో ప్రయాణం చేసే వీలుండేది. ఇప్పుడు 25 కిలోలకు పరిమితి విధించింది. బిజినెస్ ఫ్లెక్స్ ప్రయాణికులకు ఇంతకుముందు 40 కేజీల లగేజీకి అనుమతి ఉండేది. ఇప్పుడు 35 కేజీలకు తగ్గించింది. ఈ నిర్ణయం మే 2 నుంచి అమలులోకి వస్తుందని ఎయిర్ ఇండియా పేర్కొన్నది.

## భారత్, చైనాకు జెనోఫోబియా

### అందుకే ఆ దేశాల్లో ఆర్థిక ఒడిదొడుకులు: బైడెన్

వాషింగ్టన్, మే 2: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భా రత్, రష్యా, చైనా దేశాలపై విరుచుకుపడ్డారు. భారత్, చైనా, జపాన్, రష్యాలు 'జెనోఫోబిక్' (విదేశీయుల పట్ల విద్వేషం, భయం) దేశాలంటూ విమర్శించారు. భారత్ సహా ఆ దేశాలేవీ వలసదారులను ఆమోదించటం లేదని, దీంతో ఆ దేశాల ఆర్థిక అభివృద్ధిని 'జెనోఫోబియా' అడ్డుకుంటున్నదని అన్నారు. బుధవారం వాషింగ్టన్‌లో పార్టీ నిధుల సేకరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, 'చైనా ఆర్థికం దారుణంగా మారింది. జపాన్ అనేక ఇబ్బందుల్లో ఉంది. భారత్, రష్యా ఆర్థిక సమస్యల్లో ఉన్నాయి? ఎందుకంటే వాటికి 'జెనోఫోబిక్' ఉంది కాబట్టి. వలసదారులను అంగీకరించటం లేదు. వలసదారులతోనే దేశం మరింత బలోపేతమవుతుంది' అని బైడెన్ చెప్పారు. 'అమెరికా వలసదారులకు ఆహ్వానం పలుకుతున్నది కాబట్టే, ఆర్థికంగా వృద్ధి సాధిస్తున్నది' అని ఆయన అన్నారు.

# 'పాలస్తీనా' ఆందోళనలు ఉద్రిక్తం

- అమెరికా యూనివర్సిటీల్లోకి ప్రవేశించిన పోలీసు బలగాలు
- వందలాది మంది విద్యార్థుల అరెస్టు
- పోలీసులు - విద్యార్థుల మధ్య ఘర్షణ
- కాలిఫోర్నియా వర్సిటీలో తీవ్ర ఉద్రిక్తత



వాషింగ్టన్ యూనివర్సిటీలో నిరసనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

లాస్ ఏంజెల్స్, మే 2: అమెరికాలోని యూనివర్సిటీల్లో పాలస్తీనాకు అనుకూలంగా జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. నిరసనలను అడ్డుకునేందుకు వర్సిటీల్లోకి పోలీసులు ప్రవేశించడంతో పోలీసులు – విద్యార్థులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 17న కొలంబియా యూనివర్సిటీలో ఆందోళనలు ప్రారంభమై వివిధ విశ్వవిద్యాలయాలకు వ్యాపించిన సంగతి తెలిసిందే. గాజాలో తక్షణం కాల్పులు విరమించాలని, ఇజ్రాయెల్‌తో పాటు గాజాపై యుద్ధానికి మద్దతు ఇచ్చిన కంపెనీలతో యూనివర్సిటీలు సంబంధాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు విశ్వవిద్యాలయాల కేంద్రంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో లాస్ ఏంజెల్స్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల నిరసనకారుల శిబిరంపై బుధవారం రాత్రి ముసుగులు ధరించిన కొందరు ఇజ్రాయెల్ మద్దతుదారులు దాడి చేశారు. శిబిరం వద్ద బారికేడ్లను తొలగించి, పేప్పర్ స్ప్రేను వెదజల్లారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగి 15 మంది గాయపడ్డారు. తమపై దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోలేదని, సకాలంలో స్పందించలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

### వందలాది మంది అరెస్టు

వర్సిటీలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో శిబిరాన్ని ఖాళీ చేయాలని పోలీసులు పిలుపునివ్వగా విద్యార్థులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున వందలాది సంఖ్యలో పోలీసు బలగాలు వర్సిటీ క్యాంపస్ లోపలికి ప్రవేశించి బారికేడ్లు, శిబిరాలను తొలగించే ప్రయత్నం చేయడంతో విద్యార్థులు ప్రతిఘటించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. టియర్ గ్యాస్‌ను, పేప్పర్ స్ప్రేను తట్టుకునేలా నిరసనకారులు సర్జికల్ మాస్కలను, అద్దాలను ధరించారు. రబ్బర్ బుల్లెట్లను ఎదుర్కొనేందుకు ప్లైవుడ్‌తో రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. హెల్మెట్లు ధరించారు. పోలీసులు స్టన్ గ్రెనేడ్లను ప్రయోగించారు. పలువురు విద్యార్థులను బలవంతంగా అదుపులోకి తీసుకొని, నిరసన శిబిరాలను తొలగించారు. మరోవైపు పోర్ట్‌ల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ, కొలంబియా యూనివర్సిటీ, విస్కాన్సిన్ యూనివర్సిటీ, బ్రౌన్ యూనివర్సిటీల్లోనూ పోలీసులు 90 మంది నిరసనకారులను అరెస్టు చేసి నిరసన శిబిరాలను తొలగించారు. కాగా, ఇప్పటివరకు అమెరికాలోని 30 యూనివర్సిటీలు, కళాశాలల్లో దాదాపు 1,600 మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వియత్నాంపై యుద్ధానికి వ్యతిరేకంగా దశాబ్దాల క్రితం జరిగిన ఆందోళనల తర్వాత మళ్లీ ఈ స్థాయిలో అమెరికాలోని యూనివర్సిటీల్లో ఆందోళనలు జరగడం ఇదే మొదటిసారి. ఆందోళనల కారణంగా ఇప్పటికే పలు విశ్వవిద్యాలయాలు తాత్కాలికంగా మూతబడ్డాయి.

### స్థానిక చట్టాలను గౌరవించండి: విదేశాంగ శాఖ

అమెరికా యూనివర్సిటీల్లో ఆందోళనపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఇప్పటివరకు ఎంబసీని, కాన్సులేట్లను విద్యార్థులెవరూ సహాయం కోరలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. స్థానిక చట్టాలు, నిబంధనలను భారత పౌరులంతా గౌరవించాలని ఆయన కోరారు. ప్రతి ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛ, బాధ్యత, ప్రజాభద్రత, శాంతిభద్రతల మధ్య సమతుల్యత ఉండాలని పేర్కొన్నారు.

### నిరసనలతో విధానాలు మార్చుకోం: బైడెన్

యూనివర్సిటీల్లో నిరసనలపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం స్పందించారు. ప్రజాస్వామ్యానికి భిన్నాభిప్రాయాలు అవసరమని, అయితే, ఇది శాంతిభద్రతలకు విఘాతం కలించేలా ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. వర్సిటీల్లో నిరసనలు యుద్ధంపై, మధ్యప్రాచ్యంలో తమ విధానాలను మార్చుకునేలా, పునరాలోచించేలా ప్రేరేపించవని ఆయన స్పష్టం చేశారు.

# కొవిడ్ టీకా సర్టిఫికెట్‌లో మోదీ ఫొటో మాయం

- కొవిషీల్డ్ సైడ్‌ఎఫెక్ట్స్ విషయం తెలియగానే తొలగించారు
- సోషల్ మీడియాలో నెటిజన్లు
- లోక్ సభ ఎన్నికల కోడ్ వల్లే తొలగించాం: కేంద్రం



న్యూఢిల్లీ: కొవిషీల్డ్ వ్యాక్సిన్‌తో సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయన్న సంగతి బయటకు వచ్చిన నేపథ్యంలో 'కొవిడ్ వ్యాక్సిన్ సర్టిఫికెట్'లో ప్రధాని మోదీ ఫొటో మాయమవడం లోక్‌సభ ఎన్నికల వేళ చర్చనీయాంశమైంది. తాజాగా కొవిడ్ టీకా సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకున్నవారు.. ప్రధాని మోదీ ఫొటో అందులో లేకపోవటాన్ని గుర్తించారు. 'ఎక్స్' వేదికగా పలువురు యూజర్లు ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. కొవిషీల్డ్ వ్యాక్సిన్‌తో సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయని బ్రిటన్ కోర్టు ముందు 'ఆస్ట్రాజెనికా' (టీకా తయారీ కంపెనీ) అంగీకరించటమే ఇందుకు కారణమని పలువురు యూజర్లు అభిప్రాయపడ్డారు. దీనిపై కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం స్పందించింది. ఎన్నికల కోడ్‌లో భాగంగా కొవిడ్ సర్టిఫికెట్ నుంచి ప్రధాని మోదీ ఫొటోను తొలగించినట్టు తెలిపింది.

### కొవిషీల్డ్‌తో బిడ్డ మృతి.. సీరంపై తల్లిదండ్రుల దావా!

భారత్‌లో 2021లో కొవిషీల్డ్ టీకా తీసుకున్న ఓ అమ్మాయి.. కొద్ది రోజుల తర్వాత మరణించింది. ఆ అమ్మాయి తల్లిదండ్రులు ఇప్పుడు 'సీరం ఇన్‌స్టిట్యూట్'కు వ్యతిరేకంగా కోర్టులో దావా వేసేందుకు సిద్ధమవుతున్నారు. టీకా పంపిణీకి అనుమతించిన కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుబడుతూ గతంలో కొంతమంది తల్లిదండ్రులు కూడా కోర్టును ఆశ్రయించారు. బ్రిటన్ కోర్టులో ఆస్ట్రాజెనికా ప్రకటనతో, భారత్‌లో బాధిత తల్లిదండ్రుల వాదన మరోసారి తెరపైకి వస్తున్నది.

### బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : గుజరాత్ కాంగ్రెస్ చీఫ్

కరోనా వైరస్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల్ని మోదీ సర్కార్ పాటించలేదని, టీకా సైడ్ ఎఫెక్ట్స్‌తో అనేకమంది గుండెపోటు, పక్షవాతం బారినపడుతున్నారని గుజరాత్ కాంగ్రెస్ చీఫ్, ఎంపీ శక్తిసిన్హ్ గోహిల్ ఆరోపించారు. టీకా సంబంధిత మరణాల కేసుల్లో బాధిత కుటుంబాలకు కేంద్రం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కిమ్ సుఖం కోసం ఏటా 25 మంది కన్యలు!



న్యూఢిల్లీ: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌ను సంతోషపెట్టడానికి ఏటా 25 మంది కన్యలను ఎం పిక చేస్తారనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ 25 మంది కన్యల బృందాన్ని 'ప్లెజర్ స్క్వాడ్' అని పిలుస్తారు. వీరిని ఎంపిక చేసేటపుడు అందంతోపాటు కుటుంబ నేపథ్యాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఆ దేశం నుంచి తప్పించుకుని పారిపోయిన యువతి యూన్మి పార్క్ బయటపెట్టిన సంచలన విషయాల్లో ఇదొకటి. ఈ కిమ్ ప్లెజర్ స్క్వాడ్ కోసం తాను కూడా రెండు సార్లు ప్రయత్నించానని, అయితే తన కుటుంబ నేపథ్యం కారణంగా తాను ఎంపిక కాలేదని ఆమె చెప్పారు.



వరద నీటి కారణంగా దుబాయ్‌లోని ఓ వీధిలో నిలిచిపోయిన ఓ కారు

## దుబాయ్‌ని మళ్లీ ముంచెత్తిన వానలు

### పలు విమాన, బస్ సర్వీసులు రద్దు

దుబాయ్, మే 2: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని దుబాయ్‌ని గురువారం మరోసారి భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో పలు ప్రాంతాలు భారీ వరద నీటితో నిండిపోయాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షాల కారణంగా దుబాయ్, అబుదాబి, షార్జాలలో పలు విమాన, బస్ సర్వీసులను రద్దు చేశారు. కొన్ని విమానాలను దారి మళ్లించారు. అబుదాబిలోని చాలా వీధుల్లో వరద నీరు నిలిచిపోయింది. రాత్రి మూడు గంటల నుంచే ఉరుములు, బలమైన ఈదురుగాలులతో భారీ వాన ప్రారంభమైనట్టు దుబాయ్ మీడియా వెల్లడించింది.

## ఉడుకుతున్న ఊటీ

- *సాధారణం కంటే 5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు*
- *38 ఏండ్ల తర్వాత ఇదే గరిష్ఠం*

*ఊటీ: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి పర్యాటకులు ఊటీ వంటి ప్రదేశాలకు వెళ్తుంటారు. అయితే వేసవి విడిది కేంద్రమైన ఊటీలోనే ఈ ఏడాది ఎండలు భయపెడుతున్నాయి. ఈ హిల్ స్టేషన్‌లో ఏప్రిల్ 29న 29 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 5.4 డిగ్రీలు ఎక్కువని ప్రాంతీయ వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అలాగే మే 1న సాధారణం కంటే 5.1 డిగ్రీలు ఎక్కువ నమోదైంది. 1986 ఏప్రిల్ 29న 28.5 డిగ్రీలు నమోదైందని, 38 ఏండ్ల తర్వాత ఆ రికార్డు బద్ధలైందని ఆయన చెప్పారు. అయితే రాత్రి వేళలో మాత్రం వాతావరణం చల్లగానే ఉండటం టూరిస్టులకు ఊరటనిచ్చే విషయం.*

# కొవాగ్జిన్ పూర్తి సురక్షితం

### భారత్ బయోటెక్ వివరణ




హైదరాబాద్, మే 2(నమస్తే తెలంగాణ): కొవిడ్ వ్యాక్సిన్లపై పరిశోధనలు, సామర్థ్యంపై అనుమానాలు తలెత్తుతున్న నేపథ్యంలో భారత్ బయోటెక్ గురువారం స్పందించింది. 'సేఫ్టీ ఫస్ట్' (రక్షణకే తొలి ప్రాధాన్యం) అనే నినాదంతో తాము కొవాగ్జిన్‌ను తయారు చేశామని తెలిపింది. సామర్థ్యాన్ని రెండో ప్రాధాన్య అంశంగా ఎంచుకున్నామని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం' కింద తయారై, దేశంలో అన్ని రకాల పరీక్షలు పూర్తి చేసుకున్న ఏకైక వ్యాక్సిన్ కొవాగ్జిన్ అని పేర్కొన్నది. లైసెన్స్ పొందే క్రమంలో 27 వేల పరీక్షలను ఎదుర్కొన్నట్టు చెప్పింది. వేలాది మందిపై క్లినికల్ ట్రయల్స్‌ను అత్యంత పకడ్బందీగా నిర్వహించామని, కేంద్ర వైద్యారోగ్య శాఖ నిరంతరం పర్యవేక్షించిందని తెలిపింది. అందుకే ఇప్పటివరకు కొవాగ్జిన్‌కు సంబంధించి ఎలాంటి దుష్ప్రభావాలు కనిపించలేదని, రక్తం గడ్డ కట్టడం, థ్రాంబోసైటోపెనియా, టీటీఎస్, వీఐటీటీ, పెరికార్డియాటిక్స్ వంటివి నమోదు కాలేదని చెప్పింది.

